# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

రంగారెడ్డి | సంపుటి : 01 | సంచిక: 341 | పేజీలు: 4 | వెల: 4/- | బుధవారం ● 26, జూన్ 2024 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


## నేడు స్కూళ్ల బంద్‌కు ఎబివిపి పిలుపు

హైదరాబాద్,జూన్25(నమస్తే ఉదయం): ప్రైవేటు బడుల్లో ఫీజులను నియంత్రించాలని, సర్కారు బడుల్లో వసతులు కల్పించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా బుధవారం స్కూళ్ల బంద్‌కు ఎబివిపి విద్యార్థి సంఘం పిలుపునిచ్చింది. ఈ మేరకు ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి చింతకాయల ఝాన్సీ ఒక ప్రకటనలో తెలిపారు. సర్కారు బడుల్లోని సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాల దృష్టికి అనేక సార్లు తీసుకుపోయినా ఫలితం లేకుండా పోయిందన్నారు. కార్పొరేట్ స్కూళ్లలో రూ.లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నా, ఆయా మేనేజ్?మెంట్లపై ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఫీజుల నియంత్రణకు చట్టం తీసుకొస్తామని అనేక హామీలు ఇచ్చినా, ఇప్పటికీ అమలు చేయడం లేదని పేర్కొన్నారు. ఈ నెల 26న జరిగే స్కూళ్ల బంద్‌కు మేనేజ్ మెంట్లు సహకరించాలని కోరారు.




మిగతా.. 2లో

# నిధుల విడుదలే లక్ష్యంగా...

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన
- ముగ్గురు కేంద్ర మంత్రులతో భేటీ
- వైద్యారోగ్య, గృహనిర్మాణ, పట్టణాభివృద్ధి సమస్యల పరిష్కారంపై దృష్టి
- లోక్‌సభలో తెలంగాణ ఎంపీల ప్రమాణస్వీకారానికి హాజరు
- సమాఖ్య స్ఫూర్తిని చాటుతున్న ముఖ్యమంత్రి

ఢిల్లీ,జూన్25(నమస్తే ఉదయం): తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్య టన కొనసాగుతోంది. రెండు రోజుల ఢిల్లీ పర్యటనలో ముఖ్యమంత్రి ముగ్గురు కేంద్ర మంత్రులతో సమావేశం కావడంతో పాటు తెలంగాణ నుంచి ఎంపీకైన లోక్‌సభ సభ్యుల ప్రమాణ స్వీకారానికి హాజరయ్యారు. కేంద్రంలో కాంగ్రెస్‌కు వైరి పక్షమైన బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం కొలువుదీరినప్పటికీ తెలంగాణ ప్రజల ప్రయోజనాలే ప్రాధాన్యంగా సమాఖ్య స్ఫూర్తిని అనుసరించి కేంద్ర మంత్రులను కలిసి సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా ప్రయత్నిస్తున్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలో తొలి రోజైన సోమవారం రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కలిశారు. హైదరాబాద్ నగరంలో రహదారుల విస్తరణ, మౌలిక వసతుల కల్పనకు అవసరమైన రక్షణ శాఖ భూములు రాష్ట్ర ప్రభుత్వానికి బదిలీ చేయాలని కోరారు.



ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తొలినాళ్లలోనే రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కలిసిన ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి నగరంలో ఎలివేటెడ్ కారిడార్లకు అవసరమైన రక్షణ శాఖ భూముల బదలాయించాలని కోరారు. నాడు ముఖ్యమంత్రి చేసిన విజ్ఞప్తికి స్పందించిన రక్షణ శాఖ మంత్రి పలు ప్రాంతాల్లో భూముల బదలాయింపునకు అంగీకరించడంతో నగరంలో పలు ఎలివేటెడ్ కారిడర్లకు ముఖ్యమంత్రి మిగతా.. 2లో

## ఎన్‌హెచ్‌ఎం బకాయిలు రూ.693.13 కోట్లు విడుదల చేయండి

### కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జె.పి.నడ్డాకు సిఎం రేవంత్ రెడ్డి వినతి

న్యూఢిల్లీ,జూన్25(నమస్తే ఉదయం): జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) కింద తెలంగాణకు రావల్సిన బకాయిలు రూ.693.13 కోట్లు వెంటనే విడుదల చేయాలని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జె.పి.నడ్డాకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో కేంద్ర మంత్రిని మంగళవారం ఆయన కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైద్యారోగ్య రంగంపై తెలంగాణ ప్రభుత్వం పెడుతున్న ప్రత్యేక శ్రద్ధను కేంద్ర మంత్రికి వివరించారు. ఆయుష్మాన్ భారత్ నిబంధనలన్నింటిని తాము ఈ ఏడాది జనవరి నుంచి అమలు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రి నడ్డాకు తెలియజేశారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకుగానూ 5,159 బస్తీ మిగతా.. 2లో





## ఢిల్లీలో వెంకయ్యతో ప్రధాని మోడీ భేటీ

### ఇరువురి మధ్య జాతీయ ప్రయోజనాలపై చర్చ

న్యూఢిల్లీ,జూన్25(నమస్తే ఉదయం): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మంగళవారం మాజీ ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్య నాయుడుతో సమావేశమయ్యారు. మంగళవారం ఢిల్లీలోని త్యాగరాజ్ మార్గ్‌లోని వెంకయ్య నాయుడు నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా వారిద్దరూ జాతీయ ప్రయోజనాలపై అభిప్రాయాలను పంచుకున్నారు. వీరిద్దరి భేటీపై మోడీ ట్వీట్ చేశారు. తాను వెంకయ్య నాయుడును కలిశానని, ఆయనతో దశాబ్దాలుగా పని చేసే అవకాశం లభించిందని వ్యాఖ్యానించారు. భారతదేశ పురోగతి పట్ల ఆయన వివేకం, అభిరుచిని ఎప్పుడూ ప్రశంసించానని అన్నారు. అలాగే మోడీ తన నివాసానికి వచ్చి కలిశారని, భారత ప్రధానిగా మూడోసారి బాధ్యతలు చేపట్టిన మోడీకి ఈ సందర్భంగా నా హృదయపూర్వక అభినందనలు తెలియజేశాని వెంకయ్యనాయుడు ట్వీట్ చేశారు.

దేశ ప్రయోజనాలకు సంబంధించిన వివిధ అంశాలపై ఈ సందర్భంగా మా అభిప్రాయాలను పరస్పరం పంచుకున్నాము. నరేంద్ర మోడీ నాయకత్వంలో రాబోయే సంవత్సరాలలో భారత్ మరింత ప్రకాశిస్తుందని, సరి కొత్త శిఖరాలకు చేరుతుందని ఆశిస్తున్నాను అని అన్నారు.

## లోక్‌సభలో తెలుగు ఎంపిల ప్రమాణం

### అసదుద్దీన్ పాలస్తీనా నినాదాలు
### మండిపడ్డ లోక్‌సభ ఎంపిలు
### రికార్డుల్లో తొలగిస్తామన్న ప్యానల్ స్పీకర్

న్యూఢిల్లీ,జూన్25(నమస్తే ఉదయం): పార్లమెంట్‌లో మంగళవారం ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. సోమవారం నాడు కొందరు ఎంపీలు లోక్‌సభలో ప్రమాణం చేశారు. మంగళవారం సైతం ఎంపీల ప్రమాణ స్వీకార కార్యక్రమం కొనసాగించారు. ఈ క్రమంలో ఏఐఎంఐఎం అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ప్రమాణ స్వీకారం దుమారం రేపింది. అసదుద్దీన్ ఒవైసీ హైదరాబాద్ ఎంపీగా ప్రమాణ స్వీకారం చేశారు. అయితే ప్రమాణ స్వీకారం ముగిసిన వెంటనే అసదుద్దీన్ ఒవైసీ వివాదాస్పద నినాదాలు చేశారు. ప్రమాణం పూర్తి చేస్తూ చివర్లో జై భీమ్, జై మీమ్, జై తెలంగాణ, జై పాలస్తీనా అని అసదుద్దీన్ నినాదాలు చేశారు. అసదుద్దీన్ జై పాలస్తీనా అనడంపై అధికార పక్ష నేతలు సైతం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇజ్రాయెల్‌పై యుద్ధంలో హమాస్‌తో ఆశ్రయం ఇచ్చిన పాలస్తీనాకు భారత ఎంపీ ఎలా మద్దతు ఇస్తారని



బీజేపీ ఎంపీలు తీవ్ర అభ్యంతరం తెలిపారు. దీనిపై స్పందించిన స్పీకర్ ఆ పదాలను రికార్డ్స్ నుంచి తొలగిస్తామని చెప్పారు. ఎవరైనా వివాదాస్పద నినాదాలు చేస్తే వాటిని మిగతా.. 2లో

## ఎమ్మెల్యేలను చేర్చుకోవడం నీతిమాలిన చర్య

### రేవంత్ తీరుపై మండిపడ్డ కెటిఆర్
### పార్టీ మారిన వారిపై అనర్హత వేటు వేయాలి
### స్పీకర్‌ను టైమ్ కోరినట్లు జగదీశ్ రెడ్డి వెల్లడి

హైదరాబాద్,జూన్25(నమస్తే ఉదయం): పార్టీ ఫిరాయింపులకు పాల్పడుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకుంటున్న రేవంత్ తీరును ఎక్స్ వేదికగా కేటీఆర్ ఎండగట్టారు.ప్రచారంలో నీతులు మాట్లాడిన రేవంత్ రెడ్డి.. ప్రభుత్వంలోకి వచ్చాన నీతిమాలిన పనులు చేస్తున్నారని విమర్శించారు. ఒక పార్టీ తరపున గెలిచి మరో పార్టీలో చేరడం నేరం. ఎమ్మెల్యేలు పార్టీ మారితే రాళ్లతో కొట్టిచంపమన్నారు. రాజీనామా చేయకుండా ఇతర పార్టీల్లో చేరితే ఊళ్లనుంచే తరిమికొట్టమన్నారు. కానీ ఇవాళ రేవంత్ రెడ్డినే.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఇండ్లకు వెళ్లి మరీ కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్నారు. ఏ ఎమ్మెల్యేనైనా రాజీనామా చేయకుండా పార్టీ ఫిరాయిస్తే.. రాళ్లతో కొట్టించే బాధ్యత తీసుకుంటా అన్నది మీరే.



అందుకే జవాబు చెప్పాల్సింది కూడా మీరే అని రేవంత్ రెడ్డిని ఉద్దేశించి కేటీఆర్ ప్రశ్నించారు. ఇదిలావుంటే బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లిన ఎమ్మెల్యేలపై సూర్యాపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి మండిపడ్డారు. పార్టీ మారిన ఎమ్మెల్యేల సభ్యత్వాలు మిగతా.. 2లో

## ఎన్‌డిఎకు షాక్ ఇచ్చిన ఇండియా కూటమి

### స్పీకర్ పదవికి పోటీని పెట్టిన కాంగ్రెస్
### ఓంబిర్లాకు పోటీగా కొడికున్నల్ సురేశ్ నామినేషన్ : నేడు స్పీకర్ ఎన్నికకు ఓటింగ్

న్యూఢిల్లీ,జూన్25(నమస్తే ఉదయం): దేశ చరిత్రలో తొలిసారి స్పీకర్ ఎన్నికకు పోటీ జరుగుతోంది. అధికార ఎన్‌డిఎ ఏకపక్ష నిర్ణయానికి వ్యతిరేకంగా ఇండియా కూటమి సై అంటోంది. లోక్‌సభ స్పీకర్ పదవికి ఎన్డీయే అభ్యర్థిగా ఓం బిర్లా ఏకగ్రీవం అవుతారని భావించిన బీజేపీ, ఎన్డీయే కూటమికి విపక్ష కాంగ్రెస్ భారీ షాక్ ఇచ్చింది. సంఖ్యా బలం తక్కువున్నా.. కాంగ్రెస్ పార్టీ స్పీకర్ పదవికి అభ్యర్థిని నిలిపింది. ఈ మేరకు కేరళ నుంచి 8సార్లు ఎంపీగా గెలుపొందిన కొడికున్నిల్ సురేష్‌ను ఇండియా కూటమి నుంచి స్పీకర్ అభ్యర్థిగా ప్రకటిస్తూ కాంగ్రెస్ నిర్ణయించింది. ఆయన మంగళవారం తన నామినేషన్ దాఖలు చేశారు. డిప్యూటీ స్పీకర్ పదవిని విపక్షానికి అప్పగించాలన్న సంప్రదాయాన్ని బీజేపీ తుంగలో తొక్కుతోందని రాహుల్ ఆరోపించారు. మిగతా.. 2లో






## డ్రగ్స్ విషప్రయోగంతో సమానం

### డ్రగ్స్ నిర్మూలకు ప్రభుత్వం కఠిన చర్యలు
### జలవిహార్ వద్ద ర్యాలీని ప్రారంభించిన భట్టి


హైదరాబాద్,జూన్25(నమస్తే ఉదయం): రాష్ట్రంలో డ్రగ్స్ నిర్మూలనకు తమ ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోందని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఈ విషయంపై ఏ స్థాయిలో అయినా నిర్ణయాలు తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. హైదరాబాద్ నెక్లెస్‌రోడ్డులో జలవిహార్ వద్ద డ్రగ్స్ నిర్మూలన ర్యాలీని ఆయన ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. డ్రగ్స్ వినియోగం విషప్రయోగం లాంటిది.. ఇది అత్యంత ప్రమాదకరం. కుటుంబ వ్యవస్థలను విచ్ఛిన్నం చేస్తుందని అన్నారు. డ్రగ్స్ సరఫరా చేస్తున్న సంఘ విద్రోహశక్తుల చేతిలో యువత జీవితాలు చిన్నాభిన్నం అవుతున్నాయి. తెలిసీ తెలియని వయసులో వాటి బారిన పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. కొందరు కావాలనే తమ అక్రమ సంపాదన కోసం యువతకు డ్రగ్స్ అంటగడుతున్నారు. దేశాన్ని బలహీనపరిచేందుకు దేశద్రోహులు చేస్తున్న ప్రయత్నంగానూ దీన్ని చూడొచ్చని అన్నారు. రాష్ట్రాన్ని కాపాడుకునే బాధ్యత మనపైనే ఉంది. డ్రగ్స్ నిర్మూలనకు నార్కోటిక్ బ్యూరోకు ఎంత బడ్జెట్ అయినా కేటాయిస్తాం. వాటి వినియోగం, రవాణా లేకుండా చేయాల్సిన బాధ్యత మిగతా.. 2లో

## రాజీనామా చేస్తా.. పల్లెల్లో తిరుగుతా..

### ఎమ్మెల్యే సంజయ్ చేరికతో పార్టీలో చిచ్చు
### కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి తిరుబావుటా
### బుజ్జగింపులతో దిగిరాని కాంగ్రెస్ సీనియర్ నేత
### హైదరాబాద్ వచ్చాక మాట్లాడుతా.. దాపాదాస్ మున్షీ ఫోన్..

జగగిత్యాల,జూన్25(నమస్తే ఉదయం): కాంగ్రెస్ రాష్ట్ర నాయకత్వంపై ఇప్పటికే అసహనంతో ఉన్న ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి పల్లెలన్నీ తిరుగుతానని వెల్లడించారు. ప్రజల అభిప్రాయం మేరకు నిర్ణయం తీసుకుంటానని తెలిపారు. అయితే పార్టీ మారే ఆలోచన ఇప్పటివరకు అయితే లేదని పేర్కొన్నారు. అలాగే ఏ పార్టీ నుంచి కూడా ఆహ్వానం లేదన్నారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వచ్చి మాట్లాడారని జీవన్ రెడ్డి తెలిపారు. తనతో కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ దీపదాస్ మున్షీ కూడా మాట్లాడారని పేర్కొన్నారు. బీజేపీ నుంచి ఎవరూ తనను సంప్రదించలేదని స్పష్టం చేశారు.

ఏ పార్టీ నుంచి తనకు కాల్స్ రాలేదని తెలిపారు. ఈ స్టేజ్‌లో పార్టీ నుంచి గౌరవం కోరుకున్నా.. కానీ ఈ రోజు తనకు ఆ గౌరవం దక్కలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇన్నేళ్లు పార్టీ ప్రతి నిర్ణయాన్ని పాటించానని తెలిపారు . నష్టం కలిగినా పార్టీ ఎక్కడ పోటీ చేయాలన్నా చేశానని పేర్కొన్నారు. తన ప్రమేయం లేకుండానే జరగాల్సింది జరిగిందని చెప్పారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని సోమవారం శ్రీధర్ బాబు కలిసి బుజ్జగించే ప్రయత్నం చేశారు. కానీ



ఆయన లొంగలేదు. '200 కోట్ల రూపాయల నిధులు ఇచ్చి కండువా కప్పడం అవసరమా? ఇప్పుడు ప్రభుత్వానికి ఏమైంది? నా సీనియారిటీ, సిన్సియార్టీకి ఇచ్చే విలువ ఇదేనా? కార్యకర్తల కష్టాలు, మనోభావాలు అక్కర్లేదా?' అంటూ మంత్రి శ్రీధర్‌బాబు ఎదుట ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం. జగిత్యాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను పార్టీలో చేర్చుకోవడంపై కినుక వహించిన జీవన్‌రెడ్డి ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో సోమవారం సాయంత్రం తన ఇంటికి వచ్చిన మంత్రి శ్రీధర్‌బాబుపై మిగతా.. 2లో




డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ఉన్న ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్

# భోజన ప్రియులతో కలకళలాడుతున్న డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్



సచివాలయంలోని మహిళా శక్తి క్యాంటీన్‌లో...



మహిళా శక్తి క్యాంటీన్‌లో ఆహార పదార్థాలను కొనుగోలు చేస్తున్న ఉద్యోగులు, సందర్శకులు

**రాజేంద్రనగర్ జూన్25(నమస్తే ఉదయం):** డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో నూతనంగా ఏర్పాటుచేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌లు భోజన ప్రియులతో సందడిగా మారాయి. సచివాలయం లోని గ్రౌండ్ ఫ్లోర్, మూడవ అంతస్తులో మహిళా శక్తి క్యాంటీన్లను ఏర్పాటు చేశారు.

గ్రౌండ్ ఫ్లోర్‌లో ఏర్పాటుచేసిన మహిళా శక్తి క్యాంటీన్‌ను మేడ్చల్ జిల్లాకు చెందిన స్వయం సహాయక సంఘాల మహిళా సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. శాఖాహార భోజనం పుదీనా రైస్, కర్డ్ రైస్, దాల్ రైస్‌లు అందుబాటులో ఉన్నాయి. మహిళలు తమ ఇండ్లలో తయారుచేసిన సకినాలు, మురుకులు, నువ్వుల లడ్డూలు, పల్లీ లడ్డూలు, చూడువా, బూంది లడ్డూ లకు ఎంతో డిమాండ్ లభిస్తుంది. సరసమైన ధరలకు, నాణ్యమైన అ హారపదార్థాలను మహిళా శక్తి క్యాంటీన్లలో విక్రయాలు చేస్తున్నారు.



మహిళా శక్తి క్యాంటీన్

# నిధుల విడుదలే లక్ష్యంగా...

(మొదటి పేజీ తరువాయి)

శంకుస్థాపన చేశారు. ప్రస్తుత పర్యటనలో మరో 2,450 ఎకరాల భూముల బదలాయింపు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజ్‌నాథ్ సింగ్‌ను కోరారు.

ఆ భూములు రాష్ట్ర ప్రభుత్వానికి దక్కితే నగరంలో పలు ప్రాంతాల్లో రహదారుల విస్తరణతో పాటు ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు మార్గం సుగమమవుతుంది. అనంతరం కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. రాష్ట్రంలో ప్రతి పేదవాని ఇంటి కలను నెరవేర్చడమే లక్ష్యంగా ఇందిరమ్మ ఇళ్లకు శ్రీకారం చుట్టినట్లు కేంద్ర మంత్రి దృష్టికి ముఖ్యమంత్రి తీసుకెళ్లారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పట్టణ)-పీఎంఏవై (యూ) కింద కేంద్రం ఇళ్లను మంజూరు చేస్తున్నందున, తెలంగాణకు 2.70 లక్షల ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. పీఎంఏవై (యూ) కింద గ్రాంటుగా తెలంగాణకు రావల్సిన రూ.784,88 కోట్ల బకాయిలు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.

**మూసీ రివర్ ఫ్రంట్... మెట్రో రైలు..**

హైదరాబాద్ నగరానికి ఒకనాడు జీవనాడిగా ఉన్న మూసీ నది ప్రస్తుతం మురికి కూపంగా మారిపోయింది. మూసీ కాలుష్యంతో నగరంతో పాటు ఉమ్మడి నల్గొండ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మూసీ ప్రక్షాళనను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మూసీ రివర్ ఫ్రంట్‌కు కృతనిశ్చయంతో ఉన్నారు. ఇప్పటికే లండన్‌లో థేమ్స్ నది రివర్ ఫ్రంట్‌ను పరిశీలించారు.

మూసీని ప్రక్షాళన చేయడంతో పాటు నది ఒడ్డున అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి స్థానికులకు ప్రయోజనం చేకూర్చేలా తీర్చిదిద్దుతామని, ఇందుకు సహకరించాలని కోరారు. నగరంలో మెట్రో రైలు విస్తరణకు సహకరించాలని కేంద్ర మంత్రిని కోరారు. పాతబస్తీ మీదుగా మెట్రో రైలు విస్తరణకు సంబంధించిన అంశాలపై కేంద్ర మంత్రితో ఆయన చర్చించారు. ఈవిషయంలో తమకు చేయూతనివ్వాలని కోరారు.

**వరంగల్.. కరీంనగర్ సమస్యలపైనా...**

హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలో ఇతర నగరాలైన వరంగల్, కరీంనగర్ సమస్యలపైనా కేంద్ర మంత్రి ఖట్టర్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్చించారు. స్మార్ట్ సిటీ మిషన్ కింద వరంగల్, కరీంనగర్ పట్టణాల్లో చేపట్టిన పనులు పూర్తికాలేదని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఆ పనులు పూర్తయ్యే వరకు స్మార్ట్ సిటీ మిషన్ కాలపరిమితిని పొడిగించాలని కేంద్ర మంత్రిని కోరారు.

ఎన్‌హెచ్‌ఎం బకాయిలు రాబట్టేందుకు కృషి....

తెలంగాణలో ప్రజారోగ్య రంగంపై తమ ప్రభుత్వం పెడుతున్న ప్రత్యేక శ్రద్ధను కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జె.పి.నడ్డాకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. ముఖ్యమంత్రి ఢిల్లీ పర్యటనలో రెండో రోజైన మంగళవారం కేంద్ర మంత్రి నడ్డాతో భేటీ అయ్యారు. జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) కింద తెలంగాణకు రావల్సిన బకాయిలు రూ.693.13 కోట్లు వెంటనే విడుదల చేయాలని కేంద్ర మంత్రికి విజప్తి చేశారు. రాష్ట్రంలో ఆరోగ్య సేవలకు అంతరాయం కలగకుండా కేంద్రం వాటా నిధులను రాష్ట్ర ప్రభుత్వమే విడుదల చేసిందని, ఆ మొత్తాన్ని వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.

**లోక్‌సభలో....**

లోక్‌సభలో మంగళవారం జరిగిన ఎంపీల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరయ్యారు. ఎన్నికల్లో ఏ పార్టీ నుంచి గెలుపొందినా, రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా లోక్‌సభలో పోరాడాలని ఎంపీలకు సూచించారు. ప్రమాణ స్వీకారం చేసిన ఎంపీలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. రాజకీయ వైరుధ్యాలు వేరు, రాష్ట్ర ప్రయోజనాలు వేరు అనే గుర్తించి ముందుకు సాగాలని, రాష్ట్ర ప్రయోజనాల సాధనకు పార్లమెంట్‌ను వేదికగా చేసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంపీలకు సూచించారు.

## ఎమ్మెల్యేలను చేర్చుకోవడం నీతిమాలిన చర్య

(మొదటి పేజీ తరువాయి)

రద్దు కావాల్సి ఉందన్నారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. చట్టం ప్రకారం డాక్టర్ సంజయ్, పోచారం శ్రీనివాస్ రెడ్డి సభ్యత్వాలు రద్దు కావాలి. ఆ ఇద్దరు ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్ ఇచ్చేందుకు స్పీకర్‌ను సమయం కోరాం. వెసులుబాటు చూసుకొని సమయం ఇస్తానని స్పీకర్ చెప్పారు. స్పీకర్ న్యాయంగా సమయం ఇస్తారని ఆశిస్తున్నాం. అనర్హత పిటిషన్లపై ఈ నెల 27న హైకోర్టులో విచారణ ఉంది. కాంగ్రెస్ పార్టీ దేశ ప్రజలను వంచిస్తోంది. రాహుల్ కాంగ్రెస్‌ది ఒక విధానం.. రేవంత్ కాంగ్రెస్‌ది మరో విధానం. గత పదేండ్లలో ఫిరాయింపులను ప్రోత్సహించింది బీజేపీ. బీజేపీకి తోకగా తెలంగాణ పీసీసీ వ్యవహరిస్తోంది అని జగదీశ్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బాన్సువాడ, జగిత్యాల ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్ రెడ్డి, సంజయ్.. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ టికెట్‌పై గెలుపొందారు. వీరిద్దరిని రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేర్చుకున్నారు. ఈ నేపథ్యంలో ఆ ఇద్దరిపై గులాబీ శ్రేణులు మండిపడుతున్నారు. ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

## లోక్‌సభలో తెలుగు ఎంపిల ప్రమాణం

(మొదటి పేజీ తరువాయి)

రికార్డ్స్ నుంచి తొలగిస్తారు. అసదుద్దీన్ వాడిన వివాదాస్పద పదాల్ని లోక్ సభ రికార్డ్స్ లో నుంచి తొలగించే అవకాశం ఉంది.

ఆదిలాబాద్ ఎంపీ గోడెం నగేష్ హిందీలో ప్రమాణస్వీకారం చేశారు. ఎంపీలు గడ్డం వంశీ కృష్ణ, ధర్మపురి అరవింద్, రఘునందనరావు, కొండా విశ్వేశ్వరరెడ్డి, రామసాయం రఘురాం రెడ్డి ఇంగ్లీష్‌లో ప్రమాణం చేశారు. ఇక సురేశ్ షెట్కర్, ఈటల రాజేందర్, డీకే అరుణ, మల్లు రవి, కుందూరు రఘువీర్, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, కడియం కావ్య, బలరాం నాయక్ తెలుగులో ప్రమాణస్వీకారం చేశారు. ఇక హైదరాబాద్ ఎంపీ, ఏఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ ఉర్దూలో ప్రమాణం చేశారు. జై సమ్మక్క సారలమ్మ అని ఈటల రాజేందర్ నినాదం చేసారు. . జై లక్ష్మీ నర్సింహ స్వామి అని నినదించిన కిరణ్‌కుమార్ రెడ్డి. జై భద్రకాళి అని నినాదం చేసిన కడియం కావ్య. . జై తుల్జా భవాని అన్న బలరాం నాయక్,. జై భీం అని నినదించిన ఎంపీలు మల్లురవి, కావ్య, రఘురాంరెడ్డి. కాగా నిబంధనలు పరిశీలించి... రికార్డుల నుంచి తొలగించే విషయాన్ని పరిశీలిస్తానని సభాపతి స్థానంలో రాధామోహన్ సింగ్ సభ్యులకు సర్దిచెప్పారు. నిబంధనల ప్రకారం వ్యవహరిస్తానని ఆయన తెలిపారు.

## రాజీనామా చేస్తా.. పల్లెల్లో తిరుగుతా..

(మొదటి పేజీ తరువాయి)

జీవన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ క్రమంలో మంత్రి శ్రీధర్‌బాబు రెండుసార్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడండి అంటూ జీవన్‌రెడ్డిని కోరినా, 'మాట్లాడను' అంటూ తిరస్కరించినట్టు సమాచారం. మరోవైపు కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డికి రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జి దీపాదాస్ మున్షీ ఫోన్ చేశారు. రాజీనామా నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఈ సందర్భంగా కోరినట్లు సమాచారం. హైదరాబాద్ వచ్చాక అన్ని విషయాలు మాట్లాడుతామని మున్షీ చెప్పినట్లు సమాచారం. మరోవైపు ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఇంటికి చేరుకున్నారు. ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తారని వార్తలు వస్తున్న నేపథ్యంలో మరోసారి జీవన్ రెడ్డితో ఆయన మాట్లాడారు. రాజీనామా ఆలోచనను విరమించుకోవాలని జీవన్ రెడ్డిని లక్ష్మణ్ కోరారు. నాలుగు దశాబ్దాలుగా క్రియాశీల రాజకీయాల్లో ఉన్న తనను మాటమాత్రంగానైనా సంప్రదించకుండా తన సొంత నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేను పార్టీలో చేర్చుకోవడాన్ని ఆయన ఆక్షేపించారు. ఇది తనను అగౌరవపరిచినట్లేనని ఆయన ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. జగిత్యాల కాంగ్రెస్ నాయకులే కాకుండా ఇతర జిల్లాలకు చెందిన వందలాది కాంగ్రెస్ నేతలు, ప్రజాప్రతినిధులు సైతం సోమవారం ఉదయమే జీవన్‌రెడ్డి నివాసానికి చేరుకున్నారు. రాత్రి వరకూ అక్కడే ఉండి జీవన్‌రెడ్డి ఆవేదనలో పాలుపంచుకున్నారు. ఈ క్రమంలోనే ఒకరిద్దరు సీనియర్ నేతలు పార్టీకి రాజీనామా చేస్తూ టీపీసీసీ అధ్యక్షుడికి లేఖలు పంపించినట్లు ప్రకటించారు.



దీంతో పార్టీ రాష్ట్ర నాయకత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టి జీవన్‌రెడ్డిని సముదాయించడానికి ప్రయత్నాలు ప్రారంభించింది. సోమవారం మధ్యాహ్నం ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మన్‌కుమార్, మరో ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యుడు ఆది శ్రీనివాస్ జీవన్‌రెడ్డిని కలిసి ఆయనకు నచ్చజెపుతూ తొందరపాటు నిర్ణయం ఏదీ తీసుకోవద్దని కోరినట్లు తెలిసింది. పరిస్థితి తీవ్రతను గుర్తించిన పార్టీ అధినాయకత్వం మంత్రి శ్రీధర్‌బాబును దూతగా పంపగా ఆయన చర్చలు జరిపారు. జీవన్‌రెడ్డి మనోభావాలను పరిగణనలోకి తీసుకుంటామని, ఆయనకు ఏ మాత్రం ప్రాధాన్యం తగ్గకుండా పార్టీ చర్యలు తీసుకుంటుందని తెలిపారు. గతంలో మాదిరిగానే ఆయన పార్టీకి పెద్ద దిక్కుగా ఉండాలని కోరుకుంటున్నామన్నారు. ఈ సంఘటన కారణంగా మనస్తాపానికి గురైనట్లు జీవన్‌రెడ్డి వివరించారని, అన్ని విషయాలను అధిష్ఠానానికి తెలియజేస్తానని తెలిపారు. అనంతరం జీవన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ జరిగిన పరిణామాలపై శ్రీధర్‌బాబుతో చర్చించానన్నారు. కాంగ్రెస్ అభ్యున్నతి కోసం కృషి చేసిన కార్యకర్తల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. కార్యకర్తల మనోభావాలను గౌరవించాల్సిన బాధ్యత పార్టీపై ఉందని అభిప్రాయపడ్డారు. ఈ విషయాన్ని అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తానన్నారు. పార్టీ నిబంధనల్ని పాటిస్తానని, అధిష్ఠానం నిర్ణయానికి కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో నిజామాబాద్ నుంచి పోటీ చేసిన జీవన్‌రెడ్డి పరాజయం పాలయ్యారు. ఆయన్ను గెలిస్తే నిజామాబాద్ జిల్లా రాజకీయాల్లోనూ జోక్యం చేసుకుంటారన్న ఉద్దేశంతో అక్కడి నాయకులు ఆయనకు సహకరించలేదన్న ప్రచారం జరుగుతోంది. నిజామాబాద్ నుంచి మంత్రి పదవి ఆశిస్తున్న నాయకుడికి ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌తో సాన్నిహిత్యం ఉంది.

## డ్రగ్స్ విషప్రయోగంతో సమానం

(మొదటి పేజీ తరువాయి)

ఆ అధికారులదే. పోలీసులు, ప్రభుత్వ యంత్రాంగమే కాకుండా ప్రజల నుంచి కూడా సహకారం అందాలి. డ్రగ్స్ సరఫరా చేసేవారు ఎక్కడున్నా అరెస్ట్ చేసే శక్తి సామర్థ్యాలు పోలీసు వ్యవస్థకు ఉన్నాయి. పోలీసులకు సమాచారం ఇచ్చే వ్యవస్థను బలోపేతం చేసుకోవాలని సూచించారు. అన్ని గ్రామాల్లో డ్రగ్స్ నిర్మూలన కమిటీలు వేయాలి. కొత్త వ్యక్తులపై ఎల్లప్పుడూ నిఘా ఉంచాలి. తాత్కాలిక సంతోషాలకు విద్యార్థులు బలి కావొద్దు. వారు అడ్డదారులు తొక్కితే కుటుంబంతో పాటు సమాజం మొత్తం బాధపడాల్సి ఉంటుందని భట్టి విక్రమార్క అన్నారు. కార్యక్రమంలో సిఎస్ శాంతి కుమారి, పలువురు పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఎన్‌డిఎకు షాక్ ఇచ్చిన ఇండియా కూటమి

(మొదటి పేజీ తరువాయి)

ఇకపోతే సీనియార్టీ ప్రకారం సురేశ్ ప్రోటెం స్పీకర్ కావాల్సి ఉన్నా, అధికార ఎన్‌డిఎ కూటమి ఒడిషాకు చెందిన మరో సీనియర్ భర్తృహరిని ఎంపిక చేసింది. ఈ నిర్ణయంపై ఇండియా కూటమి ఆగ్రహంతో ఉంది. ఈ క్రమంలో కనీసం డప్యూటి స్పీకర్ పదవి ఇవ్వాలని కాంగ్రెస్ కోరుతోంది. డిప్యూటి పదవిని తమకే ఇవ్వాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు. అయితే సయోధ్య కుదరకపోవడంతో దేశ చరిత్రలో తొలిసారిగా లోక్‌సభ స్పీకర్ పదవికి ఎన్నిక జరగనుంది. ఇప్పటికి వరకు జరిగిన లోక్‌సభ స్పీకర్ పదవులన్నీ ఏకగ్రీవం అయ్యాయి. కాగా 75 ఏళ్ళ దేశ చరిత్రలో లోక్‌సభ స్పీకర్ పదవికి ఎన్నిక జరగడం ఇదే తొలిసారి కానుంది. తొలుత స్పీకర్ ఎన్నికను ఏకగ్రీవం అవుతుందని భావించారు. కానీ స్పీకర్ ఎన్నికకు కాంగ్రెస్ పార్టీ మెలిక పెట్టింది. కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఇండియా కూటమి సభ్యులతో జరిపిన చర్చల్లో.. డిప్యూటీ స్పీకర్ పదవిని విపక్షాలకు ఇస్తే స్పీకర్‌కి మద్దతు తెలుపుతామని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. దీంతో డిప్యూటీ స్పీకర్ పదవి ఇచ్చేందుకు ఎన్డీయే కూటమి దాదాపు అంగీకరించినట్లు వార్తలు వచ్చాయి. కానీ, కాంగ్రెస్ అనూహ్యంగా అభ్యర్థిని పోటీలో నిలిపింది. దీంతో స్పీకర్ పదవికి తొలిసారి పోటీ జరుగబోతున్నది. తొలిసారి ప్రతపక్ష అభ్యర్థిగా కొండికునాల్ సురేశ్ పోటీపడుతున్నారు. కాగా ఎన్‌డిఎ అభ్యర్థిగా ఓమ్ బిర్లా పోటీపడుతున్నారు. నామినేషన్ల ప్రక్రియ మధ్యాహ్నం 12.00 గంటలకు ముగిసింది. ప్రతిపక్ష ఇండియా బ్లాక్ తో మోడీ నేతృత్వంలోని ఎన్ డిఎ ప్రభుత్వం డిప్యూటీ స్పీకర్ విషయంలో ఓ అంగీకారానికి రాలేక పోయింది. దాంతో స్పీకర్ పదవికి పోటీ నెలకొంది. 18వ లోక్ సభ తొలి రోజు సమావేశంలో ప్రధాని నరేంద్ర మోడీ సహా 262 మంది కొత్తగా ఎన్నికయిన ఎంపీలు ప్రమాణస్వీకారం చేశారు. కాగా మిగతా 281 మంది కొత్త ఎంపీలు మంగళవారం ప్రమాణ స్వీకారం చేసారు. వారిలో కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ, సమాజ్ వాదీ పార్టీ నాయకుడు అఖిలేశ్ యాదవ్ ఉన్నారు.స్పీకర్ ఎన్నిక బుధవారం జరుగనున్నది. ఇదిలావుండగా ఇండియా బ్లాక్ కు చెందిన ఎంపీలు పార్లమెంటు లోపల, వెలుపల 'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి' అన్న నినాదాలతో, రాజ్యాంగం ప్రతులను పట్టుకుని నిరసన తెలిపారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జూన్ 27 న ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఆ తర్వాత రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే ప్రక్రియ కొనసాగనున్నది. వచ్చే వారం ఉభయ సభలలో ప్రధాని మోడీ చర్చలపై సమాధానాలు ఇవ్వనున్నారు.

## 300 కోట్ల విదేశీ నిధులు దారిమళ్లింపు

### ఓమ్ సంస్థపై ఇడి దాడులు..కేసు నమోదు

**హైదరాబాద్,జూన్25(నమస్తే ఉదయం):** విదేశాల నుంచి వచ్చిన విరాళాలు పక్కదారి పట్టించిన వ్యవహారంలో సోదాలు జరిపిన ఈడీ.. ఆపరేషన్ మొబిలిటి (ఓమ్)పై మనీలాండరింగ్ చట్టం కింద కేసు నమోదు చేసింది.

తెలంగాణ సీఐడీలో నమోదైన కేసు ఆధారంగా మరో కేసు నమోదు చేసిన ఈడీ అధికారులు మొత్తం 11 చోట్ల సోదాలు నిర్వహించారు. ఓమ్ సహా ఇతర సంస్థల పేరుతో విదేశాలకు చెందిన దాతల నుంచి రూ.300 కోట్లు సేకరించినట్లు ఈడీ పేర్కొంది. యూఎస్, కెనడా, యూకే, ఆస్ట్రేలియా, అర్జెంటీనా, డెన్మార్క్, జర్మనీ, బ్రెజిల్, ఫిన్‌లాండ్, ఐర్లాండ్, మలేసియా, రుమేనియా, సింగపూర్, నార్వే సహా పలు దేశాల నుంచి నిధులు సేకరించినట్టు తెలిపింది. తాము నిర్వహిస్తోన్న సుమారు 100 పాఠశాలల్లో చదువుతున్న ఎస్సీ, అనాథ పిల్లలకు సౌకర్యాలు కల్పిస్తామని ఈ విరాళాలు సేకరించినట్టు గుర్తించారు. విరాళాలను పక్కదారి పట్టించిన సదరు సంస్థ.. పాఠశాలల్లోని విద్యార్థుల వద్ద రూ.వెయ్యి నుంచి రూ.5వేల వరకు వసూలు చేస్తున్నట్టు సీఐడీ అధికారులు గతంలో గుర్తించారు. విరాళాల ద్వారా ఓమ్ సంస్థ తెలంగాణ, గోవా, కర్ణాటక, కేరళ, మహారాష్ట్రలో ఆస్తులు కొనుగోలు చేసినట్టు ఈడీ అధికారుల దర్యాప్తులో తేలింది. హైదరాబాద్‌లో 11 చోట్ల రెండ్రోజుల పాటు సోదాలు చేసిన ఈడీ అధికారులు.. ఆస్తులకు సంబంధించిన కీలక డాక్యుమెంట్లు, బినామీ కంపెనీల లావాదేవీల వివరాలు, డిజిటల్ పరికరాలు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.


## ఎన్‌హెచ్‌ఎం బకాయిలు రూ.693.13 కోట్లు విడుదల చేయండి

(మొదటి పేజీ తరువాయి)

దవాఖానాలు (ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు) సమర్థంగా నిర్వహిస్తున్నామని ముఖ్యమంత్రి కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నందున కేంద్ర ప్రభుత్వం సహకరించాలని, ఎన్‌హెచ్‌ఎం బకాయిలు విడుదల చేయాలని కేంద్ర మంత్రి నడ్డాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. ఎన్‌హెచ్‌ఎం 2023-24 మూడు, నాలుగు త్రైమాసికాల నిధులు రూ.323.73 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని, 024-25 మొదటి త్రైమాసిక గ్రాంట్ రూ.138 కోట్లు మంజురు చేయాల్సి ఉందని, ఆ మొత్తాన్ని వెంటనే విడుదల చేయాలని కేంద్ర మంత్రిని ముఖ్యమంత్రి కోరారు. ఎన్‌హెచ్‌ఎం కింద



చేపట్టిన మౌలిక వసతులు, నిర్వహణ కాంపోనెంట్ కింద 2023-2024 సంవత్సరానికి సంబంధించి రావల్సిన రూ.231.40 కోట్లు తక్షణమే రీయింబర్స్ చేయాలని కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. ఎన్‌హెచ్ ఎంకు సంబంధించి కేంద్రం నుంచి రావల్సిన నిధులు ఆలస్యం కావడంతో అత్యవసర వైద్య సేవలకు అంతరాయం కలగకుండా, సిబ్బందికి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు రాష్ట్ర వాటాతో పాటు కేంద్రం నుంచి రావల్సిన వాటా మొత్తాన్ని 2023, అక్టోబరు నుంచి తామే విడుదల చేస్తున్నామని కేంద్ర మంత్రి నడ్డా దృష్టికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకెళ్లారు. ము ఖ్యమంత్రి వెంట మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, ఢిల్లీలో ప్రభుత్వ ప్రతినిధి ఏ.పి.జితేందర్ రెడ్డి ఉన్నారు.



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

## వైభవంగా మహాగణపతి సంకటహర చతుర్థి పూజలు

**కొత్తకోట,జూన్25(నమస్తే ఉదయం):** వనపర్తి జిల్లా కొత్తకోట మండలం కానాయపల్లి స్టేజి దగ్గర గల సుప్రసిద్ధమైన శైవక్షేత్రం శ్రీకోటిలింగేశ్వరదత్తదేవస్థానములో మంగళవారం సంకటహర చతుర్థి సందర్భంగా మహాగణపతికి పంచామృతాలతో భస్మ గంధ కుంకుమ జలాలతో అభిషేకం జరిపి ధూపదీప నైవేద్యాలు సమర్పించి మహామంగళహారతి సమర్పించారు. మంగళవారంతో కలిసి వచ్చిన సంకటహర చతుర్థి రోజు గణనాథునికి పూజలు చేస్తే సంకటాలను తొలగించి సుఖసంతోషాలను ప్రసాదిస్తాడు గణపతి... అందుచే భక్తులు అధిక సంఖ్యలో దేవాలయానికి చేరుకొని భక్తిశ్రద్ధలతో మహాగణపతి అభిషేకంలో పాల్గొన్నారు.

## విద్యార్థులకు సైకిళ్ళు అందజేసిన ఎమ్మెల్యే జీఎంఆర్

**దేవరకద్ర,జూన్25(నమస్తే ఉదయం):** విద్యాభివృద్ధి కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానని దేవరకద్ర నియోజకవర్గం శాసన సభ్యులు జిఎంఆర్ అన్నారు. మంగళవారం నియోజకవర్గం చిన్న చింతకుంట మండలం




విద్యార్థులకు సైకిల్ అందజేస్తూ సైకిల్ తొక్కిన ఎమ్మెల్యే జిఎంఆర్

దామగ్నపూర్ గ్రామానికి చెందిన విద్యార్థిని, విద్యార్థులు వడ్డేమాన్ హైస్కూల్‌కు కాలినడకన వెళ్తున్న నేపథ్యంలో ఉచితంగా విద్యార్థిని, విద్యార్థులకు కోజెంట్ కంపెనీ సహకారంతో సైకిల్‌లు దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ... ప్రభుత్వం విద్య అభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకుంటుందన్నారు.

## వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభిని కొత్తకోట మండలం ఎంపీపీ గుంత మౌనిక



నూతన కలెక్టర్ ఆదర్శ్ సురభికు పుష్పగుచ్చం అందజేస్తున్న కొత్తకోట ఎంపీపీ గుంత మల్లేష్ మౌనిక

**కొత్త కోట,జూన్25(నమస్తే ఉదయం):** వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభిని కొత్తకోట మండలం ఎంపీపీ గుంత మౌనిక మర్యాదపూర్వం కలిసి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా కలెక్టర్ వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభిని సన్మానించిన వారిలోజిల్లా పరిషత్ చైర్మన్ లోక్నాథ్ రెడ్డి, ఎంపీపీ గుంత మౌనిక మల్లేష్, వైస్ ఎంపీపీ వడ్డే శ్రీనివాసులు, ఎంపీటీ సేసి రెడ్డి, ప్రభాకర్ రెడ్డి రాంచంద్ర యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగ ప్రతులతో విపక్ష ఎంపిల ప్రమాణం

### దానినే పాటించిన రాహుల్, అఖిలేశ్ యాదవ్

**న్యూఢిల్లీ,జూన్25(నమస్తే ఉదయం):** 18వ లోక్‌సభ తొలి సమావేశాలు కొత్త పార్లమెంట్ భవనంలో విపక్షాల ఆందోళనల నడుమ కొనసాగుతున్నాయి. ఈ సమావేశాలు సోమవారం ఉదయం ప్రారంభమైన విషయం తెలిసిందే. తొలిరోజు 280 మంది ఎంపీలు లోక్‌సభ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఎంపీలతో ప్రొటెం స్పీకర్ బర్తృహరి మహతాబ్ ప్రమాణం చేయించారు. రెండోరోజైన మంగళవారం కూడా మిగిలిన ఎంపీలు ప్రమాణం చేసారు. అయితే, ఈ సమావేశాల్లో విపక్ష ఇండియా కూటమి ఎంపీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రొటెం స్పీకర్ నియమించిన తీరుకు వ్యతిరేకంగా సమావేశాలు ప్రారంభం నుంచి విపక్ష కూటమి పార్టీల ఎంపీలంతా రాజ్యాంగ ప్రతులతో సభలో నిరసన తెలుపుతున్నారు. అదేవిధంగా రాజ్యాంగ ప్రతులతోనే ప్రమాణ స్వీకారం కూడా చేస్తున్నారు. పోడియం వద్దకు వెళ్లి ముందుగా తమ చేతిలో ఉన్న రాజ్యాంగ ప్రతిని చూపించిన తర్వాతే ప్రమాణ స్వీకారం చేస్తున్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సహా కూటమి పార్టీల ఎంపీలంతా ఇదే విధానాన్ని ఫాలో అవుతున్నారు.

# విద్యార్థుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

### కార్పొరేట్ విద్యా సంస్థల్లో అధిక ఫీజులను నియంత్రించాలని..
### షాద్ నగర్ వేద పాఠశాలలో మృతి చెందిన విద్యార్థి ఘటనపై స్పందించాలి..
### రంగారెడ్డి డీఈవో కు వినతి పత్రం అందజేసిన పంతంగి ప్రణయ్ గౌడ్,లక్ష్మీకాంత్ చారిలు

**రాజేంద్రనగర్,జూన్ 25(నమస్తే ఉదయం):** కార్పొరేట్ విద్యా సంస్థల్లో అధిక ఫీజులను నియంత్రించాలని టిఎల్ఎస్ యు రాష్ట్ర ఉపాధ్యక్షులు పంతంగి ప్రణయ్ గౌడ్ మంగళవారం రంగారెడ్డి జిల్లా డీఈవోకు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మీకాంత్ చారి ఆధ్వర్యంలో డీఈవో ను కలిశారు. ఈ సందర్భంగా పంతంగి ప్రణయ్ గౌడ్, లక్ష్మీకాంత్‌చారిలు మాట్లాడుతూ...షాద్ నగర్ వేద పాఠశాలలో విద్యుత్ స్తంభం తగిలి మృతి చెందిన విద్యార్థి సంఘటనపై వెంటనే యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్పొరేట్ విద్యా సంస్థలకు చెందిన పాఠశాలలు,కళాశాలల్లో లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నారని,ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే,పలు ప్రాంతాల్లో ఫిట్‌నెస్ లేని బస్సులు రోడ్లపై తిరుగుతూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నాయని అన్నారు. ప్రయివేట్ పాఠశాల్లో పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్,యూనిఫాంలు అధిక ధరలకు అమ్ముతున్నారని విన్నవించారు.సానుకూలంగా స్పందించిన డీఈవో తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. త్వరలోనే ఎంఈ వోతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీ,సందీప్ కుమార్, నిఖిల్, స్రవంతి, తదితరులు తదితరులు పాల్గొన్నారు.



రంగారెడ్డి జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందచేస్తున్న పంతంగి ప్రణయ్ గౌడ్, లక్ష్మికాంత్‌చారిలు

## నీట్ పరీక్ష లీకేజీపై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించాలి

### ఎన్ఎస్‌యుఐ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొల్ల జాన్

**కూకట్‌పల్లి, జూన్ 25 (నమస్తే ఉదయం):** నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై గత 15 రోజులుగా విద్యార్థులు న్యాయం కోసం పోరాటం చేస్తున్నారు.

తెలంగాణలో 70 వేలకు పైగా విద్యార్థులు నీట్ పరీక్ష రాశిరని, నీట్ ఎగ్జామ్‌కు ఒక్కరోజు ముందే పేపర్ లీక్ అయినట్లు తెలుస్తోంది. తెలంగాణలో ఉన్న వివిధ యువజన విద్యార్థి సంఘాల నాయకులతో కలిసి నీట్ విద్యార్థులకు న్యాయం చేయాలని గత కొద్దిరోజులుగా పోరాటాలు చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికే స్టూడెంట్ మార్చ్, గాంధీభవన్ నుండి ర్యాలీ, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఇంటి ముట్టడి, యూనివర్సిటీల ముందు నిరసన కార్యక్రమాలు, సిగ్నిచర్ క్యాంపైన్, మీడియా సమావేశాల్లో పలు కార్యక్రమాల ద్వారా నీట్ విద్యార్థుల పక్షాన నిలిచారన్నారు. రేపటి రోజు పేపర్ కొన్న వారు దేశానికి డాక్టర్లుగా వస్తారని అది ఎంతో ప్రమాదరమన్నారు. అందుకు దీనిపై ప్రతి ఒక్కరు పోరాడాల్సిన బాధ్యత ఉంటుందని చెప్పారు. ఎన్ఎస్‌యుఐ జాతీయ అధ్యక్షుడు వరుణ్ చౌదరి, ఇన్చార్జ్ కన్హయ్య కుమార్, ఎలాంటి పిలుపునిచ్చినా నీట్ విద్యార్థుల పక్షాన పోరాటం చేయడానికి మేము సిద్ధంగా ఉంటామని తెలిపారు. నీట్ పేపర్ లీకేజీపై కేంద్ర ప్రభుత్వం, ఎన్ టి ఏ తీరుకు నిరసనగా పార్లమెంట్ ముట్టడికి జాతీయ నాయకత్వం ఇచ్చిన పిలుపు మేరకు ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద ఏర్పాటు చేసిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొల్ల జాన్, రాష్ట్ర అధ్యక్షుడు బల్మూర్ వెంకట్, రాష్ట్ర ఇన్చార్జ్ మహమ్మద్ ఫాహాద్, నేషనల్ జనరల్ సెక్రెటరీ అనులేఖ మరియు కమిటీ సభ్యులు,జిల్లా అధ్యక్షులు ముఖ్య నాయకులు నాయకులు పాల్గొన్నారు.




# బస్తీల్లో మౌళిక వసతుల కల్పనకు కృషి..

### - కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

**రాజేంద్రనగర్,జూన్ 25(నమస్తే ఉదయం):** బస్తీల్లో మౌళిక వసతుల కల్పనకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నట్లు మైలార్ దేవులపల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని సాయిబాబానగర్, బాబుల్ రెడ్డి నగర్, వడ్డెర బస్తీలలో అధికారుల బృందం, బస్తీ వాసులతో కలిసి విస్తృతంగా పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను తోకల శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ పైప్ లైన్ పనులు, మంచినీటి సమస్య, బస్తీలో వీధీ దీపాలు సరిగ్గా వెలగని కారణంగా తాము ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. అనంతరం కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... వెంటనే సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారును ఆయన ఆదేశించారు. ఓపికతో సమస్యలను తెలుసుకున్న తోకల శ్రీనివాస్ రెడ్డి సాధ్యమైనంత వరకు అన్ని సమస్యలను పరిష్కరిస్తానని పేర్కొన్నారు. డివిజన్‌లో మౌలిక వసుతుల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నా మన్నారు. డివిజన్ పరిధిలో సమస్యలను గుర్తించి పరిష్కరిస్తా మన్నారు.

పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ ఎంసీ అధికారులు, వర్క్ ఇన్స్పెక్టర్ రాహుల్, వాటర్ వర్క్స్ డీజీఎం ఖాదర్, సూపర్వైజర్ లోక్ నాథ్, బిజెపి నాయకులు సంతు గౌడ్, మధుసూధన్ రెడ్డి,మధు,ఎన్ను శంకర్,రమేష్ రెడ్డి,గోపాల్ నాయక్, తలారి చిన్న,పాండు యాదవ్,బస్తీ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



బాబుల్ రెడ్డి నగర్ వడ్డెర బస్తీలో ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి


# మిల్లర్లు ఎఫ్.సీ.ఐ.కి ఇవ్వాల్సిన సీ.ఎం.ఆర్ ధాన్యాన్ని అప్పగించే ప్రక్రియ వేగవంతం చేయాలి

### - జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి జిల్లా ప్రతినిధి, జూన్ 25(నమస్తే ఉదయం):** రైస్ మిల్లర్లు ఎఫ్.సీ.ఐ.కి ఇవ్వాల్సిన సీ.ఎం.ఆర్ ధాన్యాన్ని అప్పగించే ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మంగళవారం వనపర్తి శివారులోని రాఘవేంద్ర ఇండస్ట్రీస్, చిట్యాల గోడౌన్, పెద్ద మందడి మండలం వీరాయ పల్లిలో ఉన్న మల్లిఖార్జున ఇండస్ట్రీస్ రైస్ మిల్లులను ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. మిల్లులలో రికార్డులను తనిఖీ చేశారు. రోజుకు మిల్లింగ్ సామర్థ్యం ఎంత? ఎంతమేర ధాన్యాన్ని మిల్లింగ్ చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు.

అనంతరం చిట్యాల గోడౌన్‌లో ఎస్.పీ.ఆర్ స్టాక్స్ తనిఖీ చేశారు. ధాన్యం నిల్వలను పరిశీలించారు. రాఘవేంద్ర ఇండస్ట్రీస్ రైస్ మిల్ ఖరీఫ్ 2023-24 సీజన్ కి గాను గత మార్చి నుంచి నేటికీ 12 ఏసీకేలు మాత్రమే డెలివరీ చేసిందని, మిగతా 43 ఏసీకేల ధాన్యాన్ని త్వరగా అప్పగించాలని ఆదేశించారు. అదేవిధంగా మిల్లింగ్ విషయంలో మిల్లర్లకు ఉన్న ఇబ్బందులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. మల్లిఖార్జున ఇండస్ట్రీస్ 2022-23 ఖరీఫ్ సీజన్ లో కేవలం 11ఏసీకే ల ధాన్యం మాత్రమే అప్పగించారని, మిగతా ధాన్యం త్వరగా అప్పగించాలని అన్నారు. లేని పక్షంలో రెవెన్యూ రికవరి చట్టం ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

పౌర సరఫరాల కార్పొరేషన్ మేనేజర్ షేక్ ఇర్ఫాన్, డిటీ నంద కిషోర్, ఇతర అధికారులు సిబ్బంది తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.



రైస్ మిల్లును తనిఖీ చేస్తున్న కలెక్టర్

